# పరిహాసం

మానం పద్మజ



ఆ నవ్వు నన్ను వెంటాడుతోంది.

కన్ను మూసినా... తెరిచినా ఆ నవ్వే!

నేను స్పష్టంగానే చూశాను.

అనుమానమే లేదు... అది నవ్వే!

టైమ్ చూశాను. పన్నెండున్నర గంటలయింది.

ఎంత ప్రయత్నించినా నిద్రరావట్లేదు.

ఒక మాత్ర వేసుకుని పడుకుంటేగాని మళ్ళీ రేపటి డ్యూటీకి సిద్ధంకాలేను.

లేచివెళ్ళి నిద్రమాత్ర వేసుకున్నాను.

'శవం నవ్వటమేంటి!'

'ఎంత విచిత్రం!'

'చనిపోయేముందు ఆ యువకుడి చివరి ఆలోచన, అనుభూతి ఏమయ్యుంటుంది!'

'ఏదైనా జోక్ గుర్తొచ్చిందేమో!'

'ప్రేయసి గుర్తొచ్చిందేమో!'

రకరకాలుగా ఊహించుకుంటున్నాను. కానీ ఒక్కటీ తృప్తినివ్వట్లేదు.

పొద్దున ట్రైన్ ఆక్సిడెంట్ కవర్ చేయటానికి వెళ్ళిన దగ్గర్నుండి నన్ను వదలకుండా వెంటాడుతున్న నవ్వు నన్ను నిద్రకూడా పోనివ్వట్లేదు.

ఫోటోలిస్తూ, నవ్వే శవం మీద స్పెషల్ ఐటమ్ ఒకటి రాయమన్నాను రిపోర్టర్ ప్రకాశ్‌తో.

"ఒళ్ళంతా ఛిద్రమైపోయి, రక్తసిక్తమైన మనిషి చనిపోతూ నవ్వగలడా? డోన్ట్ బి మాడ్! ఇట్స్ ప్యూర్‌లీ యువర్ ఇమాజినేషన్", నా మాటలు కొట్టిపడేస్తూ అన్నాడు ప్రకాశ్.

నాది పిచ్చికాదు. నిజంగానే ఆ యువకుడు చనిపోయేముందు నవ్వాడు. అందులో అనుమానమే లేదు. అది అలాగే మొహం మీద నిలిచిపోయింది.

అదే నన్ను వెంటాడుతోంది.

వేసుకున్న మాత్ర కూడా పనిచేయట్లేదు. తల భారంగా వుంది.

వెళ్ళి టీ పెట్టుకున్నాను. టైమ్ ఒంటిగంటయింది.

టీ సిప్ చేస్తూ కిటికీ దగ్గర నిలబడ్డాను.

ప్రపంచం ప్రశాంతంగా నిద్రపోతోంది.

నలుదిక్కులా చీకటి ఆవరించుకుని వుంది.

పైన మినుకుమినుకుమనే నక్షత్రాలు.

ఎవరో ఒక తాగుబోతు తూగుకుంటూ, పాడుకుంటూ వీధిగుండా వెళ్తున్నాడు.

అతను దాటిపోయేవరకు అతన్నే చూశాను.

'ఎందుకు నవ్వి వుంటాడు?', మళ్ళీ ప్రశ్న.

మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న.

సమాధానం దొరక్కపోతే నేను ఇక ఆ ప్రశ్న దగ్గరే ఆగిపోవడం ఖాయం.

ఒక్కసారిగా కుక్క అరుపుతో లోకంలోకి వచ్చాను. రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

దూరంనుంచి ఏదో అస్పష్టఆకారం కదిలివస్తోంది.

కళ్ళు చిట్లించి చూశాను.

రూపం లేదు. రంగు లేదు. కానీ అది ఆకారమే.

కాలు చెయ్యి ఆడట్లేదు. అక్కడ్నుంచి కదుల్దామని వుంది. కానీ కదల్లేకపోతున్నాను.

ఆ ఆకారం దగ్గరకు... చాలా దగ్గరకు వచ్చేసింది.

దానివంక తేరిపార చూశాను.

ఇప్పుడు నేను దాన్ని పోల్చుకోగలుగుతున్నాను.

'అవును... అదే!' పొద్దుట్నించి నన్ను వెంటాడిన నవ్వు.

పోలికలంటూ ప్రత్యేకంగా ఏమీలేవు. కానీ అది నన్ను వెంటాడిన నవ్వని నాకు అర్థమయింది.

"అవును... నేనే!" ఆకారం మాట్లాడుతోంది.

"నీ ఆలోచనా తరంగాలు నన్ను చేరుతూనే వున్నాయి. అందుకే నిన్ను వెతుక్కుంటూ ఇక్కడకు వచ్చాను".

"ఎందుకు నవ్వావు?", మనసులో మెదిలిన ప్రశ్న పెదవి దాటలేదు.

అది గ్రహించినట్లుగా ఆత్మ, "అది చెప్పేముందు అప్పటి ఆ శరీరంలోని నా గురించి కొంచెం చెప్పాలి.

నా పదిహేనవ ఏటనే నా తమ్ముడు, తాత మరణించారు. దాంతో నాకు మరణం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి పెరిగింది. నాకే ఇహలోకపు ఏ భౌతిక విలువల పట్ల ఇచ్ఛా జనించలేదు. పూనాలో ఫిలాసఫీలో పి.జి. చేశాను. మరణం మీద రీసెర్చ్ చేస్తున్నాను. ఆ పని రెండుమూడు నెలల్లో ముగుస్తుందనగా అమ్మమ్మకు ఒంట్లో బాగోలేదని కబురొస్తే ఊరెళ్ళాను.

నాతోటి కుర్రవాళ్ళలాగా కాకుండా పదిహేనేళ్ళ వయసునుంచే నేను ధ్యానం మొదలుపెట్టాను. దాని వల్ల నాకు కొన్ని శక్తులు కూడా అలవడినయ్యనే నా నమ్మిక.

నాకున్న శక్తితో భూత భవిష్యత్ కాలాల్లో ఎక్కడికైనా నేను నిన్ను తీసుకెళ్ళగలను. నీ జిజ్ఞాసని తొక్కిపెట్టాల్సిన అవసరం లేదు.

నాతోరా... నిన్ను భూతకాలంలోకి తీసుకువెళ్తాను. నీ ప్రశ్నలకు సమాధానం స్వయంగా నువ్వే తెలుసుకుందువుగాని... రా... నాతో వచ్చేయ్... వెనక్కి తిరిగి చూడకు... వచ్చేయ్... నాతో వచ్చేయ్.

***   ***

"అమ్మమ్మకి కాన్సర్. విషయం తెల్సిన దగ్గర్నుంచి అమ్మ కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తోంది. గత రెండుమూడు రోజుల్నించి అన్నం కూడా తినట్లేదు. వెంటనే బయల్దేరిరా. నువ్వు తప్ప ఈ పరిస్థితిని వేరెవరూ మార్చలేరు", ఫోన్‌లో నాన్నగారి గొంతు.

"అలాగే! బయల్దేరుతున్నాను", చెప్పాను.

గైడ్‌కి విషయం వివరించాను. ఇకో మూడు నెలల్లో నా రీసెర్చ్ వర్క్ పూర్తవుతుంది. దరిదాపు పనంతా అయిపోయినట్లే. అటువంటి సమయంలో ఫోన్.

"పరిస్థితి అలా వున్నప్పుడు ఎవరు మాత్రం ఏంచేయగలం. వెళ్ళిరా. వచ్చింతర్వాత మిగిలిన వర్క్ కంప్లీట్ చేసుకోవచ్చు", అన్నారు ఆయన.

వెళ్ళేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

నాన్నగారు హాల్లో కూర్చునున్నారు. నారయ్య చేతిలో సూట్‌కేస్ తీసికెళ్ళి రూమ్‌లో పెట్టాడు.

నాన్నగారు అమ్మ గదిలోకి వెళ్ళమన్నట్లు చెయ్యి చూపించారు.

అమ్మ గదిలోకి వెళ్ళాను.

అమ్మ ఏడుస్తోంది.

అమ్మమ్మ అమ్మ పక్కనే కూర్చుని కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, "జబ్బులు మనుషులకిగాక మానులకి వస్తాయా! ఇట్లా పోవాలని రాసిపెట్టివుంది. ఏం చేస్తాం. ఊరుకో", అంటోంది.

నన్ను చూడగానే అమ్మ దు:ఖం ఎక్కువయింది.

"ఊరుకో అమ్మా ఊరుకో! డాక్టర్‌కి చూపించారా? ఏవన్నారు", అడిగాను.

అమ్మ మాట్లాడలేదు. ఏడుస్తూనే వుంది.

"వెళ్ళొచ్చాం బాబూ. ఆపరేషన్ చెయ్యాలన్నారు.

అది అయింతర్వాత రేడియేషన్ ఇస్తామన్నారు. ఆ తర్వాత అవసరాన్ని బట్టి కీమోథెరపీ ఇవ్వాలన్నారు. అయినా అరవై దాటాక ఈ వయసుకి నేను అవన్నీ చేయించుకోవాలా? కానీ మీ అమ్మేమో నా మాట వినటంలేదు. దంపుడు బియ్యం తిన్న శరీరం. ఇప్పటివరకు బి.పి.గానీ, షుగర్‌గానీ ఎరగను. మహమ్మారిలాగా తెలీకుండా దేహంలో ఎప్పుడు పెరిగిందో... రేపే ఆపరేషన్ చేస్తామన్నారు.

తెలియగానే కొంచెం కంగారుపడ్డాను. మీ అమ్మకు నేనుపోతే ఇక పుట్టిల్లనేది వుండదు. నేను కూడా శాశ్వతం కాదనుకో! అయినా ఆ దేవుడి మీద భారం వేసి ఆపరేషన్ చేయించుకుందాం, ఏదయితే అది కానీ! అనుకున్నాను. మీ అమ్మే ఎంతకీ ధైర్యం తెచ్చుకోవట్లేదు. నువ్వే సంభాళించు బాబూ! ఎందుకంటే మన బంధుబలగంలో కానీ, నీ చుట్టూ వుండేవారి అకాల మరణాలను కానీ నువ్వు తీసుకున్నంత తేలిగ్గా ఎవరూ తీసుకోలేదు", అంది అమ్మమ్మ.

'జాతస్య మరణం ధృవం'- పుట్టిన ప్రతివాడూ గిట్టక తప్పదు. అది జీర్ణంకాకనే కదా! బుద్ధుడిని మరణ దుఃఖాన్నుంచి బయటపడేయమని వేడుకున్నప్పుడు, 'మరణం లేని ఇంటినుంచి ఆవాలు తెమ్మన్నా'డు. మరణం గురించి తెలుసుకున్నవారు జ్ఞానులు. కేవలం అజ్ఞానులు మాత్రమే మరణమంటే భయపడతారు.

ఈ చరాచర భౌతిక ప్రపంచం, మానవదేహం అశాశ్వతమైనవి. మరణం గురించిన జ్ఞానం కలిగుంటే, మనకు ఇంద్రియగోచరమయ్యే యావత్ ప్రపంచం అసత్యమైనదని తెలుస్తుంది. బాధ, దు:ఖం, ఆనందం, సంతోషం, దిగులు వంటివన్నీ మన మనసు చేసే ఇంద్రజాలాలు మాత్రమే. అవి అసంపూర్ణాలు, అసత్యాలు.

మరణం గురించి తెలిసుంటేనే, అసలు మరణమనేదే లేదని తెలుస్తుంది.

అసలు దేనికి మరణం. భౌతిక దేహానికే కదా! మనసుకి, మానవ చైతన్యానికి మరణముంటుందా?

అజ్ఞానం వల్ల దుఃఖపడుతున్నారు కానీ అసలు మరణమంటే విముక్తి. లోపభూయిష్టమైన శరీరం నుండి ఆత్మపొందే జీవన్ముక్తి.

మరణిస్తే ఎవరికైనా ఏమవుతుంది?

అది ఒక ఏమీలేనితనం... అదే క్షణంలో తానే అంతాఅయి వుండటం. అక్కడ ఎటువంటి అనుభూతులూ వుండవు. అయితే ఆత్మకు సంబంధించిన దేహంతో పెనవేసుకున్న జీవితాల్లో ఏర్పడే లోటువల్లే బంధుజనం బాధపడుతుంటారు.

నా ధ్యానం ద్వారా నేను పొందిన శక్తివల్ల నేను మరణాన్ని సైతం ఇప్పటికే అనుభూతి చెందాను.

మరణాన్ని తెల్సుకోవాలని, యోగముద్రలో కూర్చుని నా ఆత్మకు స్వేచ్ఛను ప్రసాదించాను. నేను బతికివుండగానే మృత్యువుని సైతం అనుభవించాను. చిక్కటి చీకటిలో, లోతైన అగాధాల్లో అతిశీతల మృత్యువును నా ఆత్మ సందర్శించింది.

అయినా ఈ తర్కాలన్నీ పామరులకి అర్థమవుతాయా?

"అమ్మా! 'పునరపి జననం పునరపి మరణం' అన్నారు. ఆత్మకు చావులేదు. అది నిత్యమైనది. మళ్ళీమళ్ళీ జన్మించటానికే మనం మరణిస్తాం. వృద్ధ శరీరంతో ఎవరి ఆత్మ అయినా ఈ ప్రపంచంలో సాధించగలిగేదేమీ లేదు. అందుకే అది వేరే దేహాన్ని కోరుకుంటుంది. దానికి మృత్యువే మార్గం.

> మరణం గురించి తెలిసుంటేనే, అసలు మరణమనేదే లేదని తెలుస్తుంది. అసలు దేనికి మరణం. భౌతిక దేహానికే కదా! మనసుకి, మానవ చైతన్యానికి మరణముంటుందా?

ఆపరేషన్ చేయిద్దాం. కానీ రాసిపెట్టివుంటే విధిరాతని ఎవరు మాత్రం తప్పించగలరు. మానవ ప్రయత్నంగా మన వంతు మనం చేయటమే. కానీ ప్రాకృతిక నియమానుసారంగా ఎలా జరగాలని వుంటే అలా జరుగుతుంది" అన్నాను అమ్మతో.



"రేపెప్పుడో ఎక్కడో పుట్టినా ఆ ఆత్మ మా అమ్మ కాదుగదా! మా అమ్మ లేకపోతే భౌతికంగా అది నాకు లోటేకదా! నీ మెట్ట వేదాంతం నాకు చెప్పకు. నేను వినటానికి సిద్ధంగా లేను", అంది అమ్మ నా స్వాంతన వాక్యాల్ని నిర్ద్వంద్వంగా కొట్టిపడేస్తూ.

ఏ వార్త వినటానికైనా సిద్ధపడాలి కదా అని అమ్మకు శతవిధాల నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. ఆమె కొంచెం కూడా వినిపించుకోలేదు.

అమ్మమ్మకు ఆపరేషన్ చేయించాం. దాని తర్వాత రేడియేషన్ ఇచ్చారు.

అమ్మమ్మ త్వరగానే కోలుకుంది.

"నీ పెళ్ళి చూడాలని వుంది బాబూ!" అడిగింది అమ్మమ్మ.

ఆమె అసంపూర్ణ జీవితం కోసం నా స్వేచ్ఛను వదులుకోటానికి నేను సిద్ధంగాలేను.

"అమ్మమ్మా! ఆ విషయంలో మాత్రం నన్ను బలవంతపెట్టొద్దు", చెప్పాను.

"ట్రీట్‌మెంట్ అయిపోయింది. ప్రతి ఆరునెలలకోసారి మెడికల్ చెకప్ చేయించుకోవాలి. కాన్సర్ పూర్తిగా నయమయింది, అది మళ్ళీ మీ దేహంలో ఎక్కడా పొడచూపదు అనే గ్యారంటీ మాత్రం మేమివ్వలేం. కనీసం ఐదు సంవత్సరాల వరకు తరచుగా పరీక్షలు చేయించుకోవాలి", చెప్పాడు డాక్టర్.

ఎందుకైనా మంచిదని అమ్మమ్మ వీలునామా రాయాలని నిశ్చయించుకుంది. అమ్మమ్మ వీలునామా అన్నప్పుడు, ఏవైనా అప్పగింతలు పెట్టినప్పుడల్లా ఏడవటం తప్పితే అమ్మ ఆమెకు సహకరించలేదు. అత్తగారి ఆస్తిమీద పెత్తనం అనుకుంటారని నాన్న అసలే పట్టించుకోలేదు.

'మనుషులు శాశ్వతమా! మరణమంటే మానవులకెంత భయం!'

నేనే దగ్గరుండి అమ్మమ్మ అడిగిన పనులన్నీ చేయించాను. అమ్మమ్మ ఆస్తిలో సగభాగాన్ని అమ్మ తదనంతరం నాకు చెందేటట్లుగా రాసింది. అమ్మానాన్నల అంగీకారంతో మిగిలిన సగాన్ని అనాథాశ్రమానికి రాసిచ్చింది.

బాపట్ల దగ్గర నరసాయపాలెంలో అమ్మమ్మకు ఒక


## త్వరలో ప్రారంభం!

జీవనయానం, వేదం-జీవననాదం రచనల ద్వారా పాఠకులకు జ్ఞానామృతాన్ని అందించిన దాశరథి రంగాచార్య కలం నుంచి వెలువడిన సరికొత్త నవల



## 'అమృతం గమయ'

ఇల్లు వుంది. అది కూడా చినతాతగారి పిల్లల సాయంతో అమ్మకానికి పెట్టింది. దాన్లోంచి నా థీసిస్ పుస్తకంగా ప్రచురించటానికి అవసరమైన డబ్బులు ఇస్తానంది. మిగిలిన వాటితో వృద్ధుల ఆశ్రమంలో రెండు గదులు కట్టిస్తానని మాటిచ్చింది.

అమ్మమ్మను తీసుకుని బాపట్లకు ప్రయాణమయ్యాను.

'ఇల్లు అమ్మకం అయిపోగానే అమ్మమ్మని తిరిగి హైద్రాబాద్‌లో దింపి నేను పూనా వెళ్ళాలి. అమ్మమ్మ అనారోగ్యం వల్ల ఇప్పటికే నా థీసిస్ ఆలస్యమయింది. నిన్ననే ప్రొఫెసర్‌కి ఫోన్‌చేశాను. అమ్మమ్మ ఎలాగూ డబ్బులిస్తానంది కాబట్టి థీసిస్ ఓ.కె. అయిన వెంటనే పుస్తకరూపంలో తెచ్చేయొచ్చు. మరణం మీద రీసెర్చ్ చేసిన వ్యక్తిగా తను చరిత్రకెక్కుతాడు. పుస్తకం అట్టమీది బొమ్మ గ్రాఫిక్స్‌తో 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా తేవాలి. ఆలోచిస్తుంటే ఉత్సాహం ఉరకలేస్తుంది.'

ఏదో కుదుపు... పెద్ద శబ్దం.

'అరే!... ఏమవుతుంది!'

ఒక పక్కకు నెట్టేసినట్లుగా...

అరుపులు... కేకలు... చీకటి... అంతా అల్లకల్లోలం.

ఏం జరుగుతుందో అర్థంకావట్లేదు. నేను గిరికీలు కొడుతున్నాను. దేహం స్వాధీనం తప్పుతుంది.

ఒళ్ళంతా నుజ్జునుజ్జు అయింది. కదల్లేకపోతున్నాను.

ఒళ్ళంతా పాకుతున్న వెచ్చటి రక్తం.

ట్రైన్ ఆక్సిడెంటయినట్లుంది.

బలవంతంగా కళ్ళు విప్పి చూశాను.

పట్టాల పక్కన పడున్నాను.

చుట్టూ కలియచూశాను-

నాలాగే మరికొంతమంది నా చుట్టూ.

జీవన్మరణ ఊగిసలాట.

కొంచెం గాయాల్తో బయటపడిన వారు బంధువుల కోసం వెతుక్కుంటున్నారు. నాలుక పిడచకట్టుకుపోతుంది. చెవుల్లోంచి నెమ్మదిగా నాలోని శక్తి ఆవిరవుతున్నట్లుగా తోస్తుంది.

'అమ్మమ్మా... అమ్మమ్మా', పిలుపు పెదవి దాటట్లేదు.

"బాబూ... బాబూ", ఎక్కడ్నుంచో అమ్మమ్మ పిలుపు.

కళ్ళు తెరిచి చూశాను.

అమ్మమ్మ వంగి నన్ను కదుపుతోంది.

ఎంత ప్రయత్నించినా, నా శక్తినంతా కేంద్రీకరించినా నేను బదులివ్వలేకపోతున్నాను.

'నాకు మరణం ఆసన్నమైంది'.

అమ్మమ్మ నీళ్ళ బాటిల్ వెతుక్కొచ్చి నా నోట్లో నీళ్ళు పోస్తోంది. నన్ను తట్టితట్టి లేపుతోంది.

ఊపిరి తీసుకోవటం కష్టంగా వుంది.

బహుశా ఇదే నా చివరి శ్వాసేమో!

మరణం మీద నా రీసెర్చి, నేను తయారుచేసిన థీసిస్, గత పదిహేనేళ్ళుగా అన్నీ వదులుకుని, చివరకు పెళ్ళి కూడా చేసుకోకుండా నేను పడిన తపన గుర్తొచ్చింది. మృత్యువు గురించి నాకంతా తెలుసనుకున్నాను. నాకంతా అర్థమయిందనుకున్నాను.

"బాబూ... బాబూ" అమ్మమ్మ ఆందోళనగా వంగి నా మొహంలోకి చూస్తూ ఇంకా పిలుస్తునే వుంది. ఆమె మాత్రం చిన్నపాటి గాయాల్తో బయటపడగలిగింది.

నాకు ఒక్కసారిగా నవ్వొచ్చింది.

***　　***

టైమ్ చూశాను. ఒంటిగంట రాత్రి. అంతా లిప్తపాటే...!

'అది మృత్యు పరిహాసం!' పొద్దున్నే కవర్ చేయాల్సిన రైల్వే మినిష్టర్ ప్రోగ్రాం గుర్తొచ్చి బలవంతంగా నిద్రకుపక్రమిస్తూ అనుకున్నాను.

●

# నిష్పాక్షికత కొరవడిన సమీక్ష

**'విధ్వంసమే విప్లవమా?' అనే పుస్తకంపై కిరణ్ చేసిన సమీక్షకు రచయిత వుప్పల నరసింహం ప్రతిస్పందన ఇది.**

**వా**మపక్ష తీవ్రవాదంపై నేను రాసిన వ్యాసాల సంపుటి 'విధ్వంసమే విప్లవమా?' అన్న పుస్తకంపై మే అయిదో తేదీ 'ఆదివారం వార్త'లో సమీక్ష ప్రచురించారు.

ఓ పుస్తకం చదివి దానిపై సమీక్షకుని అభిప్రాయం, వ్యాఖ్య, ఆ పుస్తకంలోని లోటుపాట్లు, దోషాలు తదితర అంశాలను పాఠకుల దృష్టికి తీసుకొస్తే పాఠకులు ఆ విశ్లేషణతో తమదైన ఓ అభిప్రాయం ఏర్పరుచుకుంటారు. ఆ పుస్తకాన్ని కొంటారు. లేదా మానుకుంటారు. ఇదీ పుస్తక సమీక్ష నుంచి ఆశించే ప్రయోజనం.

రాజ్యహింస, నక్సలైట్ల హింస నేపథ్యంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితికి తెర దించేందుకు 'పౌరస్పందన వేదిక' అటు ప్రభుత్వం, ఇటు నక్సలైట్లు చర్చలు జరపాలని పిలుపునిచ్చింది. ఆ చర్చలు జరుగుతాయనుకుంటున్న తరుణంలో కొద్దికాలం క్రితం 'వార్త' పత్రికలో నక్సలైట్లతో ప్రభుత్వం చర్చలు జరపాలా, వద్దా? అన్న అంశంపై పాఠకుల అభిప్రాయాల్ని ఆహ్వానించారు.

చాలామంది పాఠకులు తమతమ అభిప్రాయాలను తెలియజేశారు. ఆ రకంగా కూడా చాలామంది పాఠకులకు చాలా విషయాలు అవగాహనలోకి వచ్చాయి. కొంతమంది చర్చలు జరగాలన్నారు. కొందరు వ్యతిరేకించారు. నక్సలైట్ల దుందుడుకు చర్యల్ని ఖండించారు. రకరకాల అభిప్రాయాలు వెలుగు చూశాయి. ప్రజాస్వామ్యంలో అలాంటి అభిప్రాయాలు రావడం వింతేమీ కాదు.

అట్లా గత నాలుగైదు సంవత్సరాల్లో నేను జర్నలిస్టుగా వివిధ సందర్భాల్లో వివిధ వామపక్ష తీవ్రవాదసంఘటనలపై స్పందించి రాసిన వ్యాసాలను సంపుటిగా ప్రచురించాను. పాఠకుల అవగాహనను మరింత విస్తృతపరచడానికి ఉద్దేశించి రాసిన ఆ వ్యాసాల సంపుటిని కిరణ్ సమీక్షిస్తూ "అసలు ఈయన బౌద్ధాన్ని, మార్క్సిజాన్ని చదివారా అన్నది అనుమానం. పైకి కనిపించే నక్సలైట్ల చర్యల్ని మాత్రమే రచయిత తన వ్యాసాలకి ఆధారంగా చేసుకున్నారు. శాంతిభద్రతల్ని కాపాడటం కోసమే ప్రభుత్వ అణచివేత చర్యలు తీసుకుంటుందని సమర్థించారు" అంటూ ఇట్లా ఆరోపణల్లాంటి వ్యాఖ్యలు చేశారు. "మరోమాటలో చెప్పాలంటే పాలకపక్షాల కంఠస్వరమే వుప్పల నరసింహం వ్యాసాల్లో వ్యక్తమవుతుంది" అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కిరణ్ తన అభిప్రాయాలను చెప్పడానికి పూర్తి హక్కు ఉంది. అయితే ఇతరులకు మాత్రం చెప్పే హక్కులేదు అన్నట్టుగా ఉంది ఆయన ఆరోపణ, విమర్శ. ఏదైనా ఓ వ్యక్తి తాను చూసే దృష్టికోణంపై ఆధారపడి ఉంటుంది. "రాళ్ళు వేయడం బయటివాళ్ళకు తేలిక" అన్నారు. కిరణ్ నక్సలైట్ల లోపలి వారైనా ఎవరికేమి అభ్యంతరం లేదు.

అయితే తార్కికంగా, హేతుబద్ధంగా విషయాల్ని ఎవరు చెప్పినా గౌరవించాలి. వాళ్ళు మార్క్సిస్టులే కావచ్చు. నేను రాసిన వ్యాసాల్లో హేతుబద్ధంగాలేని అంశాలు, తార్కికరహిత అంశాలు ఏమిటో చెబితే బాగుండేది. అంతే గాని "ఈయన బౌద్ధాన్ని, మార్క్సిజాన్ని చదివారా అన్నది అనుమానం" అని వాఖ్యానించడం అర్థరహితం. ఆ వ్యాస సంపుటి బౌద్ధం గురించిగాని, మార్క్సిజం గురించిగాని చర్చించడానికి రాసింది కాదు. వామపక్ష తీవ్రవాదాన్ని హేతుబద్ధంగా, తార్కికదృష్టితో పరిశీలించడానికి చేసిన అతి చిన్న ప్రయత్నం.

ఇలాంటి ప్రయత్నం తప్పు. అలా చేసిన వారందరిదీ 'సర్కారీ స్వరం' అని ముద్రలు వేయడం ఏ రకమైన ప్రజాస్వామిక వ్యక్తీకరణ? చాలా సంవత్సరాలుగా 'వార్త'లోను, ఇతర పత్రికల్లోనూ నక్సలైట్ల కార్యక్రమాలపై, కార్యకలాపాలపై సంపాదకీయాలు వెలువడ్డాయి. పదునైన వ్యాఖ్యలు, అభిప్రాయాలు వెలువడ్డాయి. అనేక సభల్లో సమావేశాల్లో వారి పంథాపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. గుప్పిస్తున్నారు. రాగ్యానాయక్ హత్య అనంతరం వార్ నాయకుల్లోనే తీవ్ర విభేదాలు తలెత్తాయి. కాకతీయ ఎక్స్‌ప్రెస్‌కు నిప్పంటించిన తరువాత జరిగిన ప్రాణనష్టానికి సంవత్సరాల అనంతరం వార్ నాయకత్వమే తప్పు జరిగిందని క్షమాపణలు చెప్పుకుంది. ఇలా ఎన్నో సంఘటనలపై ఎన్నోమార్లు క్షమాపణలు చెప్పుకున్నారు నక్సలైట్లు. అలాంటి తప్పులే ఎత్తి చూపితే అలా చూపిన వారందరిదీ సర్కారీ స్వరం అన్న మాట. ఇది 'కిరణ్ తర్కం' అనుకోవాలా?

ఆరాధనాభావంతో అసలు విషయాన్ని మరచిపోవడం ఇంకా ఎన్ని రోజులు? మార్క్సిజం మీద ఈగ వాలకూడదనుకునే వీరాభిమానులు మార్క్సిజం పేర జరుగుతున్న ఘోరాలను ఆకృత్యాలను ఎందుకు ఖండించరు? నిందించరు?... అలా చేయకుండా "ఘనీభవించే" ప్రక్రియల పాలు పంచుకుంటామంటే అది వాళ్ళ ఇష్టం.

అత్యుత్సాహంతో వాస్తవ దృష్టిని మరచిపోయి, సబ్జెక్ట్‌ను పక్కన పెట్టి మిగతా వాళ్ళు అందరూ అజ్ఞానులు మేం మాత్రమే సర్వజ్ఞులం అన్న ధోరణిలో సమీక్షకులు ఉంటే ఇంతకన్నా నిష్పాక్షిక సమీక్షను ఎలా ఆశిస్తాం?

**- వుప్పల నరసింహం**

**గమనిక**

చల్లా సుబ్రహ్మణ్యం విదేశీ పర్యటనలో ఉన్నందున గత కొన్నివారాలుగా ఆయన కాలమ్ 'పర్సనల్‌పాయింట్'ను పాఠకులకి అందించలేకపోయాం. వచ్చే వారం నుంచి ఈ కాలమ్ యధాతథంగా ఆరంభమవుతుంది. - ఎడిటర్